క్లుప్తంగా

నేడు జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహావిష్కరణ

ధవళేశ్వరం: గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. జక్కంపూడి అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కాపునాడు వార్డు అధ్యక్షుల నియామకం


నియామక పత్రాలను అందిస్తున్న రఘు నరేష్ తదితరులు

సీటీఆర్‌ఐ: నగరంలోని 11 డివిజన్లకు కాపునాడు వార్డు అధ్యక్షులను (ఇన్‌చార్జులు) నియమించినట్లు కాపునాడు రాజమహేంద్రవరం పార్లమెంట్ అధ్యక్షుడు గుదే రఘు నరేష్ తెలిపారు. స్థానిక దేవీవిచౌక్‌లోని కాపునాడు రాజమండ్రి పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని 42 డివిజన్లకు గాను ప్రస్తుతం 11 వార్డులకు అధ్యక్షులను నియమించామన్నారు. త్వరలోనే మిగిలిన వార్డులకు కూడా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, ఉపాధ్యక్షుడు దైవకవాడ చక్రపాణి, కార్యదర్శులు ర్యాలీ రామకృష్ణ, చోడిశెట్టి పల్లంరాజు పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్‌లను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి

కంబాలచెరువు: స్కూల్ కాంప్లెక్స్‌లను ఉపాధ్యాయులు చక్కగా వినియోగించుకోవాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్, హెడ్స్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న తరల్, ఎఫ్ఎల్ఎన్ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించి, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ ఏ.దుర్గా తులసీదాస్ పాల్గొన్నారు.

454 మందికి వైద్యసేవలు


పొట్టిలంకలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కడియం: పొట్టిలంక గ్రామ సచివాలయం-1లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 454 మందికి వైద్యసేవలందించారు. ఒకరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యశిబిరం ఇన్‌చార్జి డాక్టర్ ఎన్.జెస్సీసుప్రియ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆర్ఎస్ఆర్ స్వరూప్, ఆర్థోపెడీషియన్ డాక్టర్ గౌస్‌బేగ్ వైద్యసేవలు అందించారు. అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది 28 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తాతారావు పాల్గొన్నారు.

కోలమూరులో 339 మందికి..

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు సచివాలయం-3లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 339 మంది వైద్యసేవలు పొందారు. పాలచర్ల పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవాణి, ఆర్థోపెడీషియన్ ప్రసాద్, గైనకాలజిస్ట్ శ్రీదేవి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సాంబయ్య వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్తం, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులు సిఫారసు మేరకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్ పాలన.. అభివృద్ధికి చిరునామా

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- కడియం మండలంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి గణేష్


కడియంలో అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి వేణు. చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు


జేగురుపాడులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన మంత్రి వేణు. చిత్రంలో జక్కంపూడి గణేష్ తదితరులు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా నిలిచిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, పౌర సంబంధాల శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన కడియంతో పాటు జేగురుపాడు, వేమగిరి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మంగళవారం ఆయన చేతుల మీదుగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పార్టీ పార్లమెంటు కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

జేగురుపాడు జగనన్న కాలనీలోని 2,700 కుటుంబాల కోసం రూ.3.58 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్, విద్యుత్ లైన్లను, కడియం సుబ్బారావుపేటలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి వేణు ప్రారంభించారు. అంబేడ్కర్ నగర్‌లో రూ.40 లక్షలతో మల్టీపర్పస్ యాక్టివిటీ కమ్యూనిటీ సెంటర్ అదనపు పనులు, రూ.11 లక్షలతో నిర్మిస్తున్న వాలీబాల్ కోర్టు పనులను పరిశీలించారు. అరుంధతిపేటలో రూ.40 లక్షలతో నిర్మించే బాబూ జగ్జీవన్‌రామ్ మల్టీపర్పస్ యాక్టివిటీ కమ్యూనిటీ హాల్ సెంటర్, బస్టాండ్ సమీపంలో రూ.75 లక్షలతో నిర్మించ తలపెట్టిన రైతు బజార్, జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.2 లక్షలతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్, రూ.24 లక్షలతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మించే ఓపెన్ జిమ్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, వాలీబాల్ కోర్టు తదితర పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో భాగంగా వేమగిరి పంచాయతీ పరిధిలోని జక్కంపూడి నగరంలో చిలుకూరు బ్రదర్స్ ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జక్కంపూడి నగర్‌లో మహిళలు ఇళ్ల స్థలాల మంజూరు కోరుతూ మంత్రికి విజ్ఞప్తి చేయగా, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను అందించాలని మంత్రి వేణు అధికారులను ఆదేశించారు.

స్పష్టమైన అభివృద్ధి

మంత్రి వేణు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ స్పష్టమైన అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. నవరత్నాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాల అందించి, ఇళ్లను నిర్మించడంతో పాటు వారికి అవసరమైన విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేశారన్నారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తున్నారన్నారు. రూ.25 లక్షలతో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు అందిస్తూ ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారన్నారు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్దాల అను, సొసైటీ చైర్మన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, యర్రా సూర్యనారాయణ, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, వార రాము, విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో జీఆర్ మనోజ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులను పర్యవేక్షించాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పోలింగ్ కేంద్రాలలో ప్రాథమిక సౌకర్యాలను బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ పాఠశాలలు, ప్రైవేట్ భవనాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సంబంధిత బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సెక్టారు, ఇంజినీరింగు అధికారులతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్తగా నమోదైన ఓటర్లను కూడా కలుపుకొని, 1400 మంది కన్నా ఎక్కువ ఓటర్లు ఉంటే, ఎక్సిలరీ పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు సెక్టార్ అధికారి ద్వారా నివేదిక ఇవ్వాలన్నారు. ఎంతమంది అర్హత కలిగిన వారికి హోమ్ ఓటింగు సౌకర్యం కల్పించాలో లెక్క తేల్చాలని, ఓటరు అంగీకారం తోనే హోమ్ ఓటింగు సిఫారసు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్‌వీఎస్ శేషగిరిరావు, ఎలక్షన్ డీటీ పవన్ కుమార్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ


జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన ప్రతిభ విద్యార్థులు

కంబాలచెరువు: ఐఐటీ, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో దానవాయిపేటలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్స్ సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ప్రతిభామూర్తి మంగళవారం తెలిపారు. టి.ప్రతీవర్ధన్ 99.86, బి.శశిర 99.01, జి.దుర్గావిఘ్నేష్ 99.01 పర్సంటైల్స్ సాధించారన్నారు. మరో 16 మంది 97 పర్సంటైల్స్ సాధించారన్నారు. అంతేకాక 50 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభలో అకడమిక్ డైరెక్టర్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సాగర్ అభినందించారు.

సత్తా చాటిన లారెల్ హైగ్లోబల్ స్కూల్ విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని లారెల్ హైగ్లోబల్ స్కూల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో విజయఢంకా మోగించారు. 58 మంది విద్యార్థులు హాజరు కాగా, 26 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హతను సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో పండగ సందడి ఏర్పడింది. సంస్థ డైరెక్టర్ సుంకర రవికుమార్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమష్టి కృషి ఫలితంగా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హెడ్ గురునాథ్ మాట్లాడుతూ పరీక్షకు హాజరైన 58 మందిలో 15 మంది 90 శాతంపైగా పర్సంటేజ్ సాధించారని, 99.40 శాతం పర్సెంటేజ్‌తో మువ్వల సాయి శైలేష్ ప్రథమస్థానంలో నిలిచినట్టు తెలిపారు. తొలి ప్రయత్నంలోనే మంచి ఫలితాలను సాధించినందుకు అభినందనలు తెలిపారు.

రోడ్డు నిబంధనలపై న్యాయవిజ్ఞాన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా రోడ్డు రవాణా అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ విషయంలో సంబంధిత అధికారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. పరిమిత వేగంతో, భద్రత ప్రమాణాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సంపత్ కుమార్ వివిధ ట్రాఫిక్ చిహ్నాలను వివరించారు. సదస్సులో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.విలియం కేరీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.బాల మురళీకృష్ణ, మెప్మా కార్యకర్తలు, వార్డు వాలంటీర్లు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

క్వారీ గోతులను పూడ్చాలంటూ నిరశన


నిరశన చేపట్టిన కొండబాబు తదితరులు

సీటీఆర్‌ఐ: ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేస్తూ నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు మంగళవారం ఉదయం నిరశన చేపట్టారు. శానిటోరియం ఎదురుగా ఉన్న రోడ్డులోని సున్నంబట్టి లేఅవుట్ వద్ద జాతీయ జెండాను చేత పట్టుకుని దీక్ష ప్రారంభించారు. ఆయనకు స్థానిక ప్రజలు, సింహాచల నగర్‌లో నివసించే హిజ్రాలు మద్దతు తెలిపారు. క్వారీ గోతులను వెంటనే పూడ్చాలని, గోతుల్లో నీరు తోడేందుకు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఇటీవల క్వారీ గోతుల్లో పడి గాయపడిన శివకోటి బుజ్జిబాబు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కొండబాబు మాట్లాడుతూ క్వారీ గోతుల్లో పడి సుమారు 20 మంది చనిపోయారని, వారం క్రితం గోతుల్లో పడిన శివకోటి బుజ్జిబాబు అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డాడన్నారు. గాయపడిన అతడికి ఇంత వరకూ క్వారీ యజమాని ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. దీక్షలో సత్య రాజరాజేశ్వరీ లేఅవుట్ కమిటీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, కార్యదర్శులు టి.బాబురావు, ఆర్.నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ధ్యానంతో సృజనాత్మక శక్తి

కంబాలచెరువు: ధ్యానంతో సృజనాత్మక శక్తి పొందవచ్చని కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 3వ వార్డు నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు యోగా మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణలో భాగంగా మంగళవారం ధ్యానం, సహజయోగం ప్రక్రియలపై వివరణాత్మక తరగతులు నిర్వహించారు. బళ్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం ద్వారా ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.సత్యవేణి, మాతాజీ నిర్మలా దేవి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బ్రిడ్జి కౌంటీకి సమీపంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో 60 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లికి చెందిన తొండెపు వీర వెంకట సత్యనారాయణరెడ్డి (60) రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బైకుపై వెళుతున్నాడు. అతడిని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి సోదరుడు వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

నేటి నుంచి దశల వారీ ఆందోళన

ప్రకాశం నగర్: స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో ఏపీ జేఏసీ నగర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పింఛన్ దారుల సంఘం నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఆందోళనకు సమాయత్తమవుతున్నామన్నారు. నగర ఎన్జీవో సంఘ అధ్యక్షులు సుబ్బారావు నాయుడు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏపీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు పాల్గొన్నారు. కాగా.. బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేయాలని జేఏసీ అధ్యక్షుడు సుబ్బారావునాయుడు పిలుపునిచ్చారు.

రాజమహేంద్రవరం అభివృద్ధే ప్రధానం

- ఎంపీ భరత్‌రామ్
- సీసీ రోడ్డు, డ్రైనేజీలకు శంకుస్థాపన


అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్


రచ్చబండలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగర అభివృద్ధే తనకు ప్రధానమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. స్థానిక 44వ డివిజన్ ఇందిరా సత్యనగర్ పుంత రోడ్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. రిజిస్టర్డ్ గృహ యజమానులు, అనధికారికంగా గృహాలు నిర్మించుకున్న వారితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ ఉభయ వర్గాలకు న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఈ రహదారి మాస్టర్ ప్లాన్‌లో ఉందని, వివాదం ఏదైనా రహదారి అభివృద్ధి ప్రధానమన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఒక కమిటీని ఏర్పాటు చేసి ఏకాభిప్రాయ సాధనతో ఈ ప్రాంతంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరించడానికి సిద్ధమన్నారు. ఇళ్ల స్థలాలకు హామీ పత్రాలిచ్చిన లబ్ధిదారులకు త్వరలోనే స్థలాలు ఇవ్వడమే కాకుండా, ఇళ్లను కూడా నిర్మించి అందజేసే పూచీ తనదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర యూత్ అధ్యక్షుడు పీత రామకృష్ణ, డివిజన్ ఇన్‌చార్జి హసీనా బేగం పాల్గొన్నారు.

రాజన్న రచ్చబండలో వినతుల వెల్లువ

రాజమహేంద్రవరం సిటీ: సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం ఆదుకోవాలంటూ పలువురు మహిళలు ఎంపీ భరత్‌రామ్‌కు మొరపెట్టుకున్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో మంగళవారం ఆయన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పలువురు మహిళలు వినతులు అందించారు. లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళ తనకు వైద్య ఖర్చుల కోసం సాయం చేయాలని కోరగా, తగిన సహాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- జగనన్న కాలనీల్లో అన్ని వసతులు
- మంత్రి వేణు


తొర్రేడు జగనన్న కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రూరల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. తొర్రేడులోని జగనన్న హౌసింగ్ కాలనీలో రూ.3.5 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.56.70 లక్షలతో నిర్మించిన రక్షిత తాగునీటి ట్యాంక్‌ను మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో 31 లక్షల మంది అర్హులైన అక్కచెల్లెమ్మల పేరున ఉచితంగా ఇంటి స్థల పట్టాలను అందించడమే కాకుండా, వారి సొంతింటి కలను జగన్ నెరవేర్చారన్నారు. ఇళ్లతో పాటు అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. ఈ సందర్భంగా మంత్రి తాగునీటి కుళాయిని ప్రారంభించి మహిళలకు బిందెలతో నీటిని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస బాబు, డీఈ నక్కపల్లి శామ్యూల్, ఏడీఈ దేవయ్య, ఏఈ పీపీ నారాయణరెడ్డి, తొర్రేడు సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకటరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేమగిరిలో హైటెక్ బస్‌షెల్టర్ ప్రారంభం

కడియం: మండలంలో వేమగిరిలో నిర్మించిన హైటెక్ బస్‌షెల్టర్‌ను మంత్రి వేణు మంగళవారం ప్రారంభించారు. ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దివంగత కాగిత వెంకటరెడ్డి, సత్యవతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, ఎస్‌కేవీఎస్ఎం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి కాగిత రాయప్ప ఈ షెల్టర్ నిర్మించారు. కడియం మండల పర్యటనలో భాగంగా విచ్చేసిన మంత్రి వేణు షెల్టర్‌ను ప్రారంభించి మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరిట ప్రజోపయోగకరమైన కార్యక్రమం నిర్వహించిన రాయప్పను అభినందించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, జొన్నాడకు చెందిన హోనీసా ఫుడ్ ఇండస్ట్రీ డైరెక్టర్ మూరా శ్రీదేవి రాంబాబు పాల్గొన్నారు. దైవజనులు పుచ్చకాయల దేవరాజు, బిషప్ పండు డేవిడ్ రాజు, పాస్టర్ నక్కా వివేకానంద, నల్లా ఎలిజిబెత్, కాటం కస్తూరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బడుగు ప్రశాంత్ కుమార్ (చిన్ని), నాయకులు కాగిత విజయకుమార్, విప్పర్తి ఫణికుమార్, కడియం మాజీ ఎంపీపీ కాగిత సత్యభారతి, ఇరిగేషన్ శాఖ సిబ్బంది శాంతికుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో మహిళా సాధికారత

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- దోసకాయలపల్లిలో సమావేశం


జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న మహిళలు

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళా సాధికారత సాకారమైందని, అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధిస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి సచివాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్న లక్ష్యంతోనే గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, హామీలన్నింటినీ అమలు జరుపుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలతో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించారన్నారు. మహిళా పక్షపాతిగా నిలిచిన జగన్‌కు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కడవల వివ, పీఏసీఎస్ చైర్మన్ గొల్లవిల్లి మురళీ, నాయకులు కోన శ్రీనివాస్, అప్పారావు, గిరి పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి మృతదేహం

కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోదావరి దోభీఘాట్ వద్ద బుధవారం యువకుడి మృతదేహాన్ని కనుగొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి విజ్జేశ్వరానికి చెందిన ఎస్.అరవింద స్వామి (23)గా గుర్తించారు. అతడు గైట్ కళాశాలలో చదువుతూ జోమోటాలో పనిచేస్తున్నాడు. ఈనెల 10న ఇంటినుంచి రాజమహేంద్రవరం వచ్చాడు. 12వ తేదీన అతని ద్విచక్ర వాహనం గోదావరి బ్రిడ్జిపై దొరికింది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న చీకట్ల వెంకటేశ్వరరావు

రాజానగరం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని పాతతుంగపాడులో పీడబ్ల్యూడీ మెట్టపై మంగళవారం సన్నాహక సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారు గానీ, దేశంలో పేదలు మాత్రం మరింత పేదరికంలోకి కూరుకుపోయారన్నారు. కార్పొరేట్ సంస్థలు, కంపెనీలకు రాయితీలిచ్చి ప్రోత్సహించే ప్రభుత్వం.. నిత్యావసర వస్తువులపై జీఎస్టీలు వేసి, సామాన్యుడి బతుకును భారం చేసిందన్నారు. దేశంలో ఒకటిన్నర లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన హామీలలో ఒకటైన ప్రత్యేక హోదాను ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి గండి కొట్టిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు లేవు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసాలకు గురించి పట్టించుకోవడం లేదు, రైల్వే జోన్ ఊసే లేదంటూ కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. రైస్ మిల్లు జట్టు కార్మిక సంఘాల అధ్యక్షుడు నల్ల శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చల్లా శ్రీను, రాయి రాంబాబు, గంధం శ్రీను, మేడపాటి సత్తిబాబు, కొప్పిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.